ACCION FRATERNA ecology centre
sustainable . human . nature

# ఎ.ఎఫ్. ఎకాలజీ సెంటర్, అనంతపురం.

ఈ మాసపు సమాచారం జూలై, 2010

FOR PRIVATE CIRCULATION ONLY

# సస్యమిత్ర గ్రూపుల పునర్వ్యవస్థీకరణ

## 1. పరిచయము

2007 సంవత్సరం జూలై నెల నుండి ఎకాలజీ సెంటరు 230 గ్రామాలలో దాదాపు 45,000 రైతు కుటుంబాలతో పాటు 5,000 కూలీ కుటుంబాలతో కూడా పని చేస్తున్నది. రైతు కుటుంబాలన్నింటిని దాదాపు 1,400ల సస్యమిత్ర గ్రూపులుగా ఏర్పాటు చేయడమైనది. అయితే గత 3 సంవత్సరాల అనుభవాలను ఒకసారి సమీక్షించినపుడు ప్రతి గ్రామంలోనూ, దాదాపు అన్ని కుటుంబాలతో కలిసి పని చేస్తుండడం వలన, శ్రమ వనరులు గ్రామాన్నంతటినీ, అన్ని గ్రూపులను ఆశించినంత స్థాయిలో ప్రభావితం చేయలేకపోతున్నవని అనుభవ పూర్వకంగా తెలుసుకున్నాము. ప్రస్తుత పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని, మన సంస్థ పని విధానములో కొన్ని ముఖ్యమైన మార్పులు ప్రవేశపెడుతున్నాము. ఇపుడు ఎకాలజీ సెంటరు ప్రతి గ్రామంలోనూ రెండు స్థాయిలలో పని చేయాలని భావిస్తున్నది.

### మొదటి స్థాయి – ప్రతి గ్రామంలోని అన్ని కుటుంబాలతో :

సుస్థిర వ్యవసాయం ఉపాధి హామీ పథకాలపై అవగాహన కార్యక్రమాలు, సుస్థిర వ్యవసాయ పద్ధతులపై సాంకేతిక సలహాలు (ఎన్.పి.ఎమ్. ద్రవ జీవామృతం, ఫర్మోన్ ట్రాపులు, ఆకర్షణ బోర్డులు మొదలగు వాటిపై) ఇతర గ్రామీణ జీవనోపాదుల చేతివృత్తుల అభివృద్ధి / ఏర్పాటు, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొనుట, ప్రభుత్వ విధానలపై సూచనలు, యువజన కార్యక్రమాలు మొదలగు వాటితో గ్రామంలోని అన్ని కుటుంబాలతో కలిసి పని చేయడం జరుగుతుంది.

### రెండవ స్థాయి – ఎన్నిక చేసుకున్న 80–100 కుటుంబాలతో :

ప్రాజెక్ట్ ఏరియాలో ఉన్న 230 గ్రామాలలో, ప్రతి గ్రామంలోనూ వివిధ వర్గాల నుండి అర్హులైన 80–100 కుటుంబాలను ఎన్నిక చేసుకొని, వారిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి పని చేయాలని ఎకాలజీ సెంటరు నిర్ణయించింది. నూరు మందిలో 20 మంది కూలీలు, 40 నుండి 60 మంది మెట్ట భూమి మాత్రమే కల్గిన చిన్న రైతులు, మరొక 20 మంది బోరుబావుల క్రింద నీటి సాగు కల్గిన రైతులు ఉంటారు. 60 మంది మెట్ట రైతులలో 20 నుండి 40 మంది ఎస్.సి., ఎస్.టి.లు, మిగిలిన 20 మంది ఇతర వర్గాల నుండి ఉంటారు. ఈ 80–100 కుటుంబాలను 4 రకాల గ్రూపులుగా ఏర్పాటు చేయాలి. అవి (1) నీటి సాగుకల రైతుల గ్రూపు. (2) ఎస్.సి., ఎస్.టి. మెట్ట రైతుల గ్రూపు (3) ఇతర వెనుకబడిన వర్గాల మెట్ట రైతుల గ్రూపు (4) కూలీల గ్రూపు. నూరు కుటుంబాల కన్నా తక్కువ కుటుంబాలు కలిగిన గ్రామాలలో మొత్తం కుటుంబాలతో పని చేయాలి. చిన్న గ్రామాలలో తక్కువ వచ్చిన కుటుంబాల స్థానంలో పెద్ద గ్రామాలలో అయిదు కన్నా ఎక్కువ గ్రూపులు చేయటం ద్వారా కవర్ చేయాలి.

## 2. నాలుగు రకాల గ్రూపులు - లక్ష్యాలు - కార్యక్రమాలు

### 1. నీటి సాగు రైతుల గ్రూపు

**ఎ) ఉద్దేశ్యములు :**

(1) గ్రూపులోని సభ్యుల మధ్య పరస్పర సహకార వ్యవస్థను ఏర్పాటు చేయడం (2) గ్రూపులోని రైతు సభ్యులందరూ సుస్థిర వ్యవసాయ పద్ధతులు పాటించడం (3) తమ పొలాల్లో రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడకుండా, స్థానికంగా లభించే సహజ వనరులతో సేంద్రీయ ఎరువులు, పురుగు వికర్షణ, సంహారక కషాయాలు తయారు చేసుకోవటం ద్వారా పెట్టుబడులను తగ్గించుకుని వ్యవసాయోత్పత్తిని పెంచుకొనుట. (4) భూసారాన్ని కాపాడుకుని, బహుళ పంటలు, వృక్ష పంటలు, పంట మార్పిడి, నీటి ఆదా పద్ధతులను పాటించి అధిక దిగుబడులను పొందుట. (5) పశు సంపదను అదనపు జీవనోపాదులను ఏర్పరుచుకుని అధిక ఆదాయాన్ని పొందుతూ స్వయం సమృద్ధి సాధించుట.

**బి) అర్హతలు :**

నీటి సాగుతో వ్యవసాయం చేస్తూ, రసాయన ఎరువులు, పురుగు మందులు తగ్గించి, తక్కువ ఖర్చుతో సుస్థిర వ్యవసాయ పద్ధతులు పాటించుటకు ఇష్టపడే 20 రైతు కుటుంబాలు ఒక గ్రూపుగా ఉంటారు. వీరు ఒక్కొక్క కుటుంబము రూ. 50/– సభ్యత్వ రుసుము చెల్లించాలి.

**సి) కార్యక్రమాలు :**

- ✦ సభ్యుల మధ్య పరస్పర సహకారమును తీసుకొని వచ్చుట.
- ✦ సమగ్ర వ్యవసాయ విధానమును ప్రోత్సహించుట అనగా కార్తె పంటలు, వృక్ష పంటలు, పశు పోషణను ఒకదానితో ఒకటి అనుసంధానము చేయుట.
- ✦ శాస్త్రీయంగా ఎరువు దిబ్బల ఏర్పాటు, వానపాముల ఎరువులు, అజోల్లా, ద్రవ జీవామృతం ప్రోత్సహించుట.
- ✦ పొలంబడులను నిర్వహించుట.
- ✦ రసాయనిక పురుగు మందులు లేకుండా చీడ పీడల నివారణను ప్రోత్సహించుట.
- ✦ మేతనిచ్చు గడ్డి రకాలు, మేత నిచ్చు చెట్ల సాగుకు ప్రోత్సహించడం.
- ✦ డ్రిప్, స్ప్రింక్లర్ల ప్రోత్సహించుట.
- ✦ జండర్ శిక్షణలు ఇచ్చుట.
- ✦ సమగ్ర సుస్థిర వ్యవసాయం పై శిక్షణలు, సలహాలు సమావేశాలు నిర్వహించుట.
- ✦ సుస్థిర వ్యవసాయం పాటించే సంస్థలు, రైతుల వద్దకు విజ్ఞాన యాత్రలు ఏర్పాటు చేయుట.
- ✦ ప్రదర్శన క్షేత్రాలు ఏర్పాటు చేయుట.
- ✦ శ్రీ వరిని ప్రోత్సహించుట.
- ✦ బహుళ పంటలు, వృక్ష పంటలు, ఆహార పంటలు, పంట మార్పిడిని ప్రోత్సహించుట.
- ✦ ప్రభుత్వ వనరుల / కార్యక్రమాల వినియోగం.
- ✦ వ్యవసాయోత్పత్తుల విలువ పెంపు, గిట్టుబాటు ధరకై కృషి చేయుట.
- ✦ దేశీయ మేలుజాతి పశువుల అభివృద్ధి కై తోడ్పాటునందించుట. →

"భూమాత అపారమైన తన అడవుల్ని, వన్య ప్రాణుల్ని, నదుల్ని, సముద్రాల్ని కాపాడుకుంటున్నంత వరకూ మానవ సంతతి వర్ధిల్లుతూనే ఉంటుంది" ఉపనిషత్తులు

- వ్యవసాయ విధానాలలో, ప్రభుత్వ కార్యక్రమాలలో లోపాలను గుర్తించి, సరైన విధానాల రూప కల్పన చేయుట.
- యువతకు నైపుణ్యాల శిక్షణ, ఉపాధి కల్పన.

## 2 & 3. రెండు మెట్ట రైతుల గ్రూపులు – (ఒకటి ఎస్.సి., ఎస్.టి. గ్రూపు, ఇంకొకటి ఇతర వెనుకబడిన వర్గాల గ్రూపు)

### ఎ) ఉద్దేశ్యములు :

1. గ్రూపులోని సభ్యుల మధ్య పరస్పర సహకార పద్ధతిని ఏర్పాటు చేయుట. 2. గ్రూపులోని సభ్యులందరూ తమ పొలంలోనూ మరియు స్థానికంగా లభించు సేంద్రీయ సహజ వనరులను వినియోగించుకొంటూ తక్కువ ఖర్చుతో వ్యవసాయము చేసి శాశ్వత అధిక ఉత్పత్తిని సాధించుట. 3. రసాయనిక ఎరువులు, పురుగు మందుల వాడకం నిలిపివేసి స్థానిక వనరులతో తామే తయారు చేసుకొన్న సేంద్రీయ ఎరువులు వాడుట. 4. రసాయన మందులు వాడకుండా చీడ పీడల నివారణ చేయుట ద్వారా, భూమి ఉత్పాదకతను పెంచడంతో పాటు, పెట్టుబడులను బాగా తగ్గించుకొను. 5. గ్రూపు సభ్యుల మధ్య పరస్పర సహకారమును పాటించుట. 6. బహుళ పంటలు, వృక్ష పంటలు, ఆహార పంటలు, పశుపోషణ ద్వారా కనీసం కుటుంబ పోషణకు సమతుల్య ఆహార భద్రతను సాధించుట. 7. ప్రభుత్వ వనరులను కార్యక్రమాలను సక్రమంగా వినియోగించుట. 8. ఉపాధి హామీ పథకం ద్వారా తాత్కాలిక ఉపశమనం పొందుతూ వివిధ రకాల వృక్ష పంటలనూ, దీర్ఘకాల, సుస్థిర వ్యవసాయోత్పత్తిని అభివృద్ధి చేసుకోవడం ద్వారా నమ్మకమైన బహుళ ఆదాయ మార్గాలను ఏర్పాటు చేసుకొనుట. 9. ఆదాయ భద్రతతో జీవన విధానాన్ని మెరుగు పరుచుకొని గౌరవప్రదమైన జీవనం గడుపుట.

గ్రామానికి కనీసం 2 మెట్ట రైతుల గ్రూపులు ఏర్పాటు చేయడం జరుగుతుంది.

1) వెనుకబడిన వర్గాల మెట్ట రైతుల గ్రూపు.

2) యస్.సి., యస్.టి., వర్గాల మెట్ట రైతుల గ్రూపు.

### బి) అర్హతలు :

**1) వెనుకబడిన వర్గాల మెట్ట రైతుల గ్రూపు :** 1) మెట్ట వ్యవసాయంతోపాటు, ఉపాధి హామీ పథకంలో కూలీ కూడా చేసుకొనే రైతులు అంటే వ్యవసాయంతో పాటు కూలీ పైన కూడా ఆధారపడిన బీద రైతులు. 2) వర్షాధారం క్రింద సుస్థిర వ్యవసాయ పద్ధతులు పాటిస్తూ తమ భూమిని వృక్ష పంటలతో, పశు పక్ష్యాదులతో అభివృద్ధి చేసుకొనుటకు, శ్రమ పడడానికి ఇష్టపడే రైతులు. 3) వీరు ఒక ఎకరంలోపు నీటి పారుదల కలిగిన భూమి కలవారైె కూడా ఉండవచ్చు. 4) వీరు సం॥లో 30 నుండి 50 రోజుల వరకు ఉపాధి హామీ పథకంలో పని చేసి వుంటారు. వీరు ఒక్కొక్క కుటుంబము రూ. 25/– సభ్యత్వ రుసుము చెల్లించాలి.

**2) ఎస్.సి. మరియు ఎస్.టి. వర్గాల మెట్ట రైతుల గ్రూపు :** పైన చెప్పిన అర్హతలన్నీ వీరికి కూడా వర్తిస్తాయి. అదనంగా 1) గ్రామంలో ఎస్.సి. మరియు ఎస్.టి. కుటుంబాలు 10 కన్నా తక్కువ ఉన్నప్పుడు వారిలో నీటి వసతి కలిగిన కుటుంబాలు నీటి సాగు రైతుల గ్రూపులోనూ, మెట్ట భూమి మాత్రమే కలిగిన కుటుంబాలు మెట్ట రైతుల గ్రూపులోను ఉంటారు. 2) 10 కన్నా ఎక్కువ ఎస్.సి. / ఎస్.టి. కుటుంబాలు గ్రామంలో ఉన్నప్పుడు వారి ఆసక్తిని బట్టి నీటి వసతిని బట్టి వారు ఒకటి లేదా రెండు ప్రత్యేక గ్రూపులుగా ఏర్పడుతారు. వీరు ఒక్కొక్క కుటుంబానికి సభ్యత్వ రుసుము రూ. 20/– చెల్లించాలి.

### సి) కార్యక్రమాలు :

- గ్రూపు సభ్యులు పరస్పర సహకారము కలిగి వ్యవసాయ పనులలోనే కాకుండా ఇతర అంశాలలో కూడా ఒకరికొకరు తోడుగా వుండునట్లు ప్రోత్సహించుట.
- మెట్ట వ్యవసాయంతో కార్తె పంటలు, వృక్ష పంటలు, పశువులను అనుసంధానం చేసి లాభసాటిగా సమగ్ర వ్యవసాయం విధానము పాటించునట్లు చేయుట.
- ఉపాధి హామి పథకం వినియోగం పై అవగాహనతోపాటు, దాని ద్వారా దీర్ఘకాలంలో ఉత్పాదక ఆస్తులను పెంపొందించుకొనుటపై శిక్షణలు, సలహాలు ఇచ్చుట.
- పొలంబడులు నిర్వహించుట.
- దేశీయ మేలు జాతి పశు రకాలను అభివృద్ధి చేయుట.
- తనకు అవసరమైన సేంద్రీయ ఎరువులను తానే తయారు చేసుకొనుటను ప్రోత్సహించుట (శాస్త్రీయ దిబ్బలు, వానపాముల ఎరువు, ద్రవ ఎరువులు మొదలగునవి)
- రసాయన మందులు లేకుండా చీడ పీడల నివారణ చేయుట.
- మెట్ట వ్యవసాయంలో పంట మార్పిడి, బహుళ పంటలు, వృక్ష పంటలను (మేత, పండ్లు, కలప, పచ్చి ఆకు, మందు మూలికల చెట్లు) ప్రోత్సహించుట.
- సుస్థిర వ్యవసాయంపై శిక్షణ, సలహాలు, సమావేశాలు అవగాహనా సదస్సులు ఏర్పాటు చేయుట.
- సమగ్ర వ్యవసాయ విధాన ప్రదర్శనా క్షేత్రాల ఏర్పాటు.
- నిరంతర పెరటి తోటలు, పాలేకర్ పద్ధతిలో చిన్న చిన్న కమతాలలో, కడవలనీళ్లతో కుటుంబానికి అవసరమైన ఆహార ఉత్పత్తిని ప్రోత్సహించుట.
- అదనపు జీవనోపాదుల ఏర్పాటు.
- మెట్ట వ్యవసాయ ప్రదర్శన క్షేత్రాలకు, సుస్థిర వ్యవసాయ రైతుల పొలాలకు విజ్ఞాన యాత్రలు ఏర్పాటు చేయుట.
- విత్తన బ్యాంకులు ఏర్పాటు చేయుట.
- జెండర్ శిక్షణలు ఇచ్చుట.
- యువతకు నైపుణ్యాల శిక్షణ ఉపాధి కల్పన.

## 4. కూలీల గ్రూపు

### ఎ) ఉద్దేశ్యములు :

(1) గ్రూపు సభ్యుల మధ్య పరస్పర సహకార పద్ధతిని ఏర్పాటు చేయుట. (2) ఉపాధి హామీ పథకం సక్రమ వినియోగం ద్వారా వృక్ష పంటలను పెంచుకొని తద్వారా భూ ఉత్పాదకతను మెరుగుపర్చుకుని ఆహార భద్రతను, ఆదాయ భద్రతను సాధించుట. (3) వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవటం ద్వారా అదనపు ఆదాయ మార్గాలను ప్రోత్సహించుట. (4) మౌలిక సదుపాయాలను ఉమ్మడి వనరులను వినియోగించుకుంటూ, కనీస అవసరాల కార్యక్రమాలను సక్రమంగా వినియోగించుకొంటూ, ఆర్థికంగా సామాజికంగా సమానత్వాన్ని సాధించి గౌరవప్రదమైన జీవనం గడుపుట.

### బి) అర్హతలు :

(1) భూమిలేని కూలీలు (2) భూమి వుండి కూడా ఉపాధి హామీ పథకంలో ఒక సంవత్సరంలో 50 రోజులకన్నా ఎక్కువ పని దినాలు పని చేసిన వారు గ్రూపు సభ్యులుగా చేరుటకు అర్హులు. వీరి సభ్యత్వ రుసుం ఒక్కొక్క కుటుంబానికి రూ. 20/– చెల్లించవలసి వుంటుంది.

### సి) కార్యక్రమాలు :

- గ్రూపు సభ్యుల మధ్య పరస్పర సహకార పద్ధతులను ప్రోత్సహించి, జీవనోపాధులలోనూ ఇతర అవసరాలలోనూ ఒకరికొకరు తోడుగా వండునట్లు ప్రోత్సహించుట.
- ఉపాధి హామీ పథకంపై అవగాహనా సదస్సులు, సమావేశాలు, శిక్షణలు నిర్వహించుట.
- ఉపాధి హామీ పథకాన్ని స్వల్పకాల ఉపాధితోపాటు, దీర్ఘకాల ఉత్పాదక ఆస్తులను పెంచే విధంగా సమర్థవంతంగా అమలు చేయుట.
- దారిద్ర్య నిర్మూలనకు కనీస అవసరాలు తీర్చుటకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన పథకాల సక్రమ వినియోగానికి కృషి చేయుట.

- ✦ అదనపు జీవనోపాధుల కల్పన.
- ✦ యువకులకు వృత్తి శిక్షణలు, ఉపాధి కల్పన.
- ✦ గ్రామీణ ఉమ్మడి భూములను అభివృద్ధి చేయటంలోనూ, వాటిలో ఫలసాయములో భాగస్వామ్య కల్పన.
- ✦ జెండర్ శిక్షణలు నిర్వహించుట.
- ✦ చేతి వృత్తులను మెరుగుపరచుకొనుటలో చేయూత.
- ✦ నిరంతర పెరటి తోటలు ప్రోత్సహించుట.
- ✦ యువతకు నైపుణ్యాల శిక్షణ, ఉపాధి కల్పన.

### 3. గ్రూపుల నిర్మాణము

అర్హత కలిగి ఎన్నుకోబడిన ప్రతి కుటుంబము నుండి ఇద్దరు కుటుంబ సభ్యులు, అనగా ఒక స్త్రీ ఒక పురుషుడు గ్రూపులో సభ్యులుగా నమోదు చేసుకొనవలయును. ఒక వేళ ఒక ఇంటిలో స్త్రీలు లేకున్న ఒక పురుషుడు మాత్రమే కుటుంబ సభ్యుడుగా నమోదు చేసుకోవచ్చును. ఒక వేళ ఒక ఇంటిలో పురుషులు లేకున్న ఒక స్త్రీ మాత్రమే కుటుంబ సభ్యురాలుగా నమోదు చేసుకోవచ్చును. సాధ్యమైనంతవరకు భూములు ఒకే చోట ఉన్న వారిని గ్రూపులుగా చేయాలి (లేదా) 4 లేక 5 కుటుంబాల భూములు కలిపి ఒక సముదాయం (బ్లాక్)గా ఉన్నప్పుడు అటువంటి 4 లేక 5 బ్లాకులకు చెందిన రైతులను కలిపి ఒక గ్రూపుగా చేయాలి (లేదా) వ్యవసాయ అవసరాలు ఒకటిగా ఉంటూ ఒకే వీధిలో నివాసం ఉండి గ్రూపుగా ఏర్పడటానికి ఇష్టపడే వారిని ఒక గ్రూపుగా చేయాలి. గ్రామాలలోని చేతి వృత్తుల కుటుంబాలు ప్రత్యేక గ్రూపుగా కాకుండా వారి భూమికి కల నీటి వసతిని బట్టి నీటి సాగు / మెట్ట కూలీల గ్రూపులో ఉంటారు. ఐ.ఎఫ్.ఎస్., బిఫ్స్, ఐ.బి.ఎమ్., ఎమ్.ఎఫ్.టి.సి. ప్రదర్శనా క్షేత్రాలలోనూ ఫారమ్ ఫారెస్ట్రీ లోనూ మెట్ట రైతులను కవర్ చేయాలి. ప్రతి గ్రూపును భూములు సముదాయము లేదా కార్యక్రమాల పై శ్రద్ధ ఆధారంగా రెండు ఉప గ్రూపులుగా ఏర్పాటు చేసి, ఒక ఉప గ్రూపుకి కన్వీనర్ మరొక ఉప గ్రూపుకి కో-కన్వీనర్ ప్రాతినిధ్య బాధ్యత వహించేలా చూడాలి. ప్రతి గ్రూపు కన్వీనరుగా ఒక మహిళను, కో కన్వీనరుగా ఒక పురుషుని ఏకాభిప్రాయంతో ఎన్నకోవలయును. కన్వీనరుగా, కో-కన్వీనరుగా ఎన్నుకొనబడేవారు నాయకత్వ లక్షణాలు కలిగి చురుకైన వారుగా వుండవలయును. వారికి సమగ్ర సేంద్రీయ వ్యవసాయ పద్ధతులపై నమ్మకము, ఇష్టము ఉండవలయును.

### 4. సమాఖ్యల నిర్మాణము

#### 1. గ్రామ సమాఖ్య నిర్మాణము :

గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రూపుల నుండి ఎన్నిక కాబడిన కన్వీనర్, కో-కన్వీనర్లు (9-11 మంది) కలిసి గ్రామ సమాఖ్యగా ఏర్పడతారు. అదనంగా ఒక ఆదర్శ రైతును లేదా నాయకత్వ లక్షణాలుగల స్త్రీని ఏకాభిప్రాయంతో కో-ఆప్షన్ చేసుకొనవలయును. ఈ సభ్యుల నుండి కన్వీనర్‌గా ఒక మహిళను, కో- కన్వీనర్‌గా ఒక పురుషుని ఏకాభిప్రాయంలో ఎన్నుకోవాలి.

#### 2. మండల సమాఖ్య నిర్మాణము :

మండలంలోని ప్రతి గ్రామ సమాఖ్య నుండి ఎన్నికకాబడిన కన్వీనర్లు, కో-కన్వీనర్లు (30 గ్రామాల నుండి 60 మంది) కలిసి మండల సమాఖ్యగా ఏర్పడతారు. మరల ఈ సభ్యుల నుండి కన్వీనర్‌గా ఒక మహిళను, కో-కన్వీనర్‌గా ఒక పురుషుడిని ఏకాభిప్రాయంతో ఎన్నుకోవాలి.

నమస్కారములతో

మీ

**డా॥ వై.వి. మల్లారెడ్డి**

**డైరెక్టరు : ఎకాలజి సెంటరు.**

## టొమోటో పంటను లాభసాటిగా మార్చుకున్న రాంపురం గ్రామ రైతు

ధర్మవరం మండలంలోని రాంపురం గ్రామానికి చెందిన పి. చంద్రశేఖర్ తండ్రి పెద్ద సుబ్బరాయుడుకు సర్వే నెంబరు 133లో మూడు ఎకరాలకు నీటి వసతిగల భూమి ఉంది. కాయగూరల పంటలు వేస్తే, విపరీతమైన తెగుళ్ళు, వాటిని అరికట్టడానికి పురుగు మందులు వాడడం, వాటి ఖర్చులు తడిసి మొప్పందుం కావడం - ఇంతా చేస్తే మార్కెట్టులో గిట్టుబాటు ధరలేక పోవడంతో రైతులు సాహసించడం లేదు. ఈ పరిస్థితులలో ఎకాలజీ సంస్థ కార్యకర్తలు పంటలలో ఖర్చులు తగ్గించుకోవడానికి, రసాయనిక పురుగు మందులు వాడకుండా ప్రకృతిని రక్షించుకోవడానికి రైతులకు నచ్చ చెపుతుండడం చూసి, టొమెటో పంట వేయాలనుకుని ఒక ఎకరాలో టొమెటో పంట వేశాడు. రసాయనిక ఎరువుల వాడకుండా పేడ ఎరువులు వాడాడు. పంటల మీద పురుగు కనపడిన వెంటనే కషాయాలు వాడడం ద్వారా వాటిని అదుపులో ఉంచుకున్నాడు. ఎకాలజీ సంస్థ సిబ్బంది సూచనల మేరకు నెలకు రెండు సార్లుగా జీవామృతం చల్లినాడు. పూత దశలో పులిసిన మజ్జిగ చల్లడంవల్ల, పూత బాగా నిలిచింది. కాపు బాగా కాశింది. ఆదాయం, ఖర్చులు ఈ విధంగా వున్నాయి.

### ఖర్చులు :

| | | |
|---|---|---|
| భూమి అచ్చుకట్టె వేసిన కూళ్ళు | - | 1,000.00 |
| పేడ ఎరువు ఖరీదు | - | 1,200.00 |
| టొమెటో విత్తనం ఖర్చు | - | 600.00 |
| జీవామృతం చేసిన ఖర్చు | - | 600.00 |
| కూలీల ఖర్చు | - | 800.00 |
| ఆటో రవాణా ఖర్చులు | - | 400.00 |
| **మొత్తము** | - | **4,600.00** |

### ఆదాయం :

| | | |
|---|---|---|
| మొదటగా 20 కే.జీలు 10/- వంతున | - | 2,000.00 |
| రెండవసారి ,, | - | 2,000.00 |
| మూడవసారి 22 కే.జీలు 6/- వంతున | - | 1,320.00 |
| నాలుగవసారి 20 కే.జీలు 6/- వంతున | - | 1,200.00 |
| ఐదవసారి 20 కే.జీలు 5/- వంతున | - | 1,500.00 |
| **మొత్తము** | - | **8,020.00** |

### నికరాదాయం

**8,020.00 (-) 4,600.00 = 3,420.00**

హంపన్న (STL)

# సుస్థిర వ్యవసాయ పద్ధతులలో...

## సమగ్ర వ్యవసాయ పథకం ద్వారా పొలానికి మళ్ళిన రైతు

ధర్మవరం మండలం తుమ్మల గ్రామానికి చెందిన రైతు దంపతులు లక్ష్మీదేవి, శ్రీనివాసులుకు సర్వే నెం. 62-63 లలో 2.96 ఎకరాల పొలం వుంది. ధర్మవరం చెరువు కింద 0.70 సెంట్ల తరి ఉంది. చెరువుకు నీళ్ళు రాకపోవడం కారణం చేత సంవత్సరాల తరబడి అందరి తరి భూముల్లాగే ఇతని భూమి కూడా బీడుపడి కంపచెట్లు పెరుగుతున్నాయి. కాబట్టి 70 సెంట్ల భూమి ఉన్నా లెక్కలో లేనట్లే. భార్యా భర్తలతో పాటు ఒక కూతురు కూడా ఉంది. చదువుకుంటోంది. సామాన్యంగా భూమి వుంటే రైతుకు ఏదో కొంతయినా, ఏదో ఒక సందర్భంలో ఉపయోగపడుతుందని అందరూ భావిస్తారు. రైతు శ్రీనివాసులు తన భూమి తన సంపాదనను తినడానికే వుంది అంటాడు. అదెలాగా అంటే వివరాలు చెప్పుకొచ్చాడు.

శ్రీనివాసులుకు రాతకోతల అనుభవం వుంది. గ్రామంలోని మహిళా గ్రూపులకు రాతకోతలు నిర్వహించేది ఇతనే. ఏమైనా పనులుంటే ఎవరో ఒకరు పిలచడం ఆలస్యం ఆ వంక మీద ధర్మవరం వెడతాడు. భార్య లక్ష్మీదేవి మూడు ఎనుములు సాకుతూ వాటి పాలు తీసి ఇచ్చేది. ధర్మవరం దగ్గర కావడం మూలనా పాలకు మంచి గిరాకి వుంటూ మొత్తం జీవనమంతా పాలమీద వచ్చిన ఆదాయంతోనే సాగేది. అదనంగా అప్పుడప్పుడూ భార్యభర్తలు కూలినాలి చేసేవారు. చిన్న కుటుంబం కావడం మూలంగా తగు మాత్రం ఖర్చుతో తిండికి లోటు లేకుండానే బతికే వారు. పాల ద్వారానూ కూలినాలి పనుల్లోనూ వచ్చిన ఆదాయంతో వచ్చిన మిగులుబాటు అంతా పొలంలోకే వెళ్ళిపోయేది. శ్రీనివాసులుకు ప్రతి సంవత్సరం వ్యవసాయం మీద పెట్టిన ఖర్చంతా అణా పైసల్లో రాసి పెట్టే అలవాటు వున్నవాడు. గడచిన 10-12 సంవత్సరాల నుంచి ఏ ఒక్క సంవత్సరం, ఆఖరికి పంట బాగా పండిందనుకున్న సంవత్సరం కూడా దానికి దానికే సరిపోయింది. కానీ మిగతా సంవత్సరాలన్నీ ఆదాయంలో లోటేనంటాడు. ఉదాహరణకు 2008 ఖరీఫ్‌లో పొలంలో వేరుశెనగ పంటకు పెట్టిన ఖర్చు రూ.25,000/- చెనిక్కాయలు అమ్మగా వచ్చిన ఆదాయం 20,000/-. అయిదు వేల పెట్టుబడి నష్టంతోపాటు తాము తమ కుటుంబం పడిన శ్రమంతా లెక్కలేకుండాపోతోంది. ఈ విధంగా ప్రతి సంవత్సరం పంట పెట్టడం ఎంతో కొంత నష్టపోవడం జరుగుతూ వుంది. ప్రతి సంవత్సరం నష్టపోతున్నప్పుడు పంట పెట్టడమే మానివేయవచ్చుగదా అని ప్రశ్నిస్తే, నష్టమొచ్చినా పంట పెట్టడం రైతు మర్యాద. పంట పెట్టకపోతే రైతుకు దానికి మించిన అవమానం ఇంకొకటి లేదు అంటాడు. ఏ రైతు కూడా తన మాదిరి ఖర్చు, ఆదాయల లెక్కావారం రాయకూడదంటాడు. రాస్తే రైతులు తట్టుకోలేరంటాడు.

ఈ విధంగా ఎందుకింత నష్టం వస్తున్నదని అడిగితే శ్రీనివాసులు చెప్పిన సమాచారం ఈ విధంగా వుంది...

శ్రీనివాసులుకు ఎద్దులు, పనిముట్లు లేవు. పదును తర్వాత చేసేదుక్కి, విత్తనం, కలుపు, మెట్ల పాయడం, చెనిక్కాయలు అమ్మేంత వరకూ అన్ని బాడుగలు పెట్టాల్సిందే. విత్తనం విత్తిన తర్వాత, మధ్యలో మెట్ల పాయడానికి ఒకసారి, చివరగా చెనిక్కట్టె పీకడానికి పొలానికి వెళ్ళేవాడు. ఈ మధ్యకాలంలో చేని మొగం చూసే అలవాటు లేకుండా పోయింది. రసాయనిక మందులు, రోగాలకు పురుగు మందులు, కాయల ఖరీదు, బాడుగలు కూళ్ళు అన్నీ కలిపితే, పంట ద్వారా వచ్చే ఆదాయంపోను నష్టం మాత్రమే మిగిలేది. ఈ పరిస్థితులలో చుట్టుపక్కల భూములకు రేట్లు పెరగడంతో వ్యవసాయంతో ఇంత కష్టపడి నష్టాలు మూటకట్టుకోవడం కంటే, భూమి అమ్మగా వచ్చిన డబ్బు బ్యాంకులో వేసుకుంటే, వచ్చే వడ్డీ ఆదాయంగా వుంటుందని చాలా మంది సలహా ఇచ్చారు. కానీ శ్రీనివాసులు దంపతులు ఆ పని చేయలేదు. ఈ నేపథ్యంలో 2008లో అనంతపురంలో సుస్థిర వ్యవసాయంపై జరిగిన రైతు సదస్సుకు వెళ్ళడం జరిగింది. ఆ సదస్సులో ఎకాలజీ సంస్థ డైరెక్టరు డా॥ వై.వి. మల్లారెడ్డిగారు వర్షపు నీరు కాపాడుకోవడం గురించి, సుస్థిర వ్యవసాయ పద్ధతుల గురించి మాట్లాడిన మాటలకు ప్రభావితుడైనాడు. వెంటనే తన పొలంలో పడిన వర్షం నీరు బయటకు పోకుండా కట్టలు వేయించుకున్నాడు. ఇక అప్పటి నుండి పొలం మీద శ్రద్ధ పెరిగింది. 2009 ఖరీఫ్‌లో ఎకాలజీ సంస్థ సిబ్బంది ఇచ్చిన సూచనల ప్రకారం చెనక్కాయ వేసినాడు. మొదటిసారిగా నష్టం లేకుండా పంట చేతికొచ్చింది. వర్షపు నీరు బయటకి పోకుండా వేసిన కట్టల మీద, ఆముదాలు, కంది, అలసంద, అనుములు నాటాడు. చెనిక్కాయ పీకిన తరువాత ఉలవలు వేసినాడు. ఉలవలు, కట్టె కూడా వచ్చింది. అంతే కాకుండా పొలంలో కట్టల మీద అక్కడక్కడా నాటిన కాయగూరల విత్తనాలు నాటడంవల్ల, ఇంటి వాడకానికి కాయగూరలు వచ్చినాయి. పంటలు కూడా వచ్చినాయి. వీటన్నింటినీ ఎకాలజీ సంస్థ వారే ఇచ్చినారు. ఆ రకంగా శ్రీనివాసులు ఇంటికి పౌష్టికాహార వసతి కుదిరి పోయింది. పొలం వ్యవసాయం బేకారు కాదు, మనసు పెట్టి పద్ధతులు పాటిస్తే, వ్యవసాయం మీద బతక వచ్చునని శీనప్ప తెలుసుకున్నాడు.

శ్రీనివాసులు, లక్ష్మీదేవి రైతు దంపతుల కష్టపడే మనస్తత్వం, పట్టుదల గమనించిన మీదట, సంస్థ తరపున సమగ్ర వ్యవసాయ పథకం కింది రైతుకు పళ్ళ మొక్కలు ఇవ్వడం జరిగింది. మొత్తం 165 చెట్లు మామిడి, సపోటా, ఉసిరి, సీతాఫలం చెట్లతో పాటు గట్లమీద కానుగ, ఆవిశ, సీమ తంగేడు, సీమ కానుగ, సుబాబుల్ మొక్కలను నాటించారు. ఫర్లాంగు దూరంలో ఉన్న బోరు నుంచి నీళ్ళు మోసి మొక్కలను పెంచసాగారు. చెట్లు నాటుకోవడానికి గుంతల వైశాల్యం రూ.5/-, 12/-, 7/- వంతున చెల్లించడం జరిగింది. నెలకు 4 సార్లుగా, ఎండల కాలంలో 6 సార్లుగా చెట్లకు నీళ్ళు పోసి బతికించుకుంటున్నాడు. నీళ్ళు పోసుకున్న దానికి చెట్టు ఒకటి 2 1/2 రూపాయలచొప్పున సంస్థ రైతుకు చెల్లిస్తోంది. నీళ్ళు మోయడం కష్టమని సైకిల్ పై బిందెలతోపోసి, కొన్నాళ్ళయిన తరువాత గుంతను తవ్వి, బండలతో తాపడం చేసి ట్యాంకరుకు రూ.510/- వంతున కొని నీటిని నిలువ చేశాడు. 1/2 హెచ్.పి. మోటారును, పైపును కొనుగోలు చేసి, నీటిని పైపు ద్వారా ప్రతి చెట్టుకు అందించే ఏర్పాటు చేసుకున్నాడు. వీరి శ్రమను గుర్తించి, వీటిని నిలువ చేసే గుంతలోని నీరు ఆవిరి కాకుండా సంస్థ ఇనుప రేకుల్ని మంజూరు చేసింది.

ఎప్పుడో తప్ప పొలం ముఖం చూడని శీనప్ప ఇపుడు పొలంలోనే ఉంటున్నాడు. తమ భూమిని, చెట్లను ఎలా అభివృద్ధి చేసుకోవాలా అని ఆలోచిస్తున్నాడు. ఒకే పంటతో నష్టాన్ని చూస్తున్న శీనప్ప పలురకాల పంటలు వేసి నష్టం లేకుండా పంట తీయడం ప్రారంభించాడు. బహుళ పంటలు వేయడం ప్రారంభించడంవల్ల 2009 ఖరీఫ్‌లో ఆదాయలు, ఖర్చులు ఈ విధంగా వున్నాయి.

మొత్తం ఖర్చు రూ. 22,000/-, వేరుశెనగ ఆదాయం రూ. 20,000/-, వేరుశెనగ కట్టె 2,800/-, ఆముదాలు, కందులు, దాదాపు 3,000/- ఇవిగాక కాయగూరలు. ఇదే పద్ధతి కొనసాగిస్తూ పూర్తి కాలపు రైతులుగా కొనసాగాలనుకుంటున్నారు. శ్రీనివాసులు, లక్ష్మీదేవి.

ప్రచురణ: డైరెక్టరు - ఆర్.డి.టి. ఎకాలజీ సెంటర్, ఉప్పరపల్లి రోడ్డు, బెంగుళూరు హైవే, అనంతపురం - 515 002.
☎ (08554) - 244222 / 246884, ఫ్యాక్స్ : (08554) - 244990, E-mail : actionf@sancharnet.in
actionf_atp@dataone.in